సాక్షి
ప్రకాశం
బుధవారం | 8 | నవంబర్ | 2023



ఊరు.. ఉసూరు!

టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెంలో అభివృద్ధి పనులకు టీడీపీ సర్పంచ్ కుమారులు సైంధవుల్లా అడ్డుపడుతున్నారు. పనులకు తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు. - IIలో..



వంద రోజుల ఉపాధి

ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు వంద రోజుల పని కల్పించాలని కలెక్టర్ దినేష్ కుమార్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
31.2/24.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏబీపీ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: యాస్పిరేషనల్ బ్లాక్ (మండలం) ప్రోగ్రాం కోసం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్న చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. యర్రగొండపాలెం మండల ప్రజా పరిషత్‌లో డేటా ఎంట్రీ, డేటా వ్యాలిడేషన్, డేటా ఎవెల్యూషన్ తదితర పనులు యాస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.55 వేల వేతనం ఉంటుందని తెలిపారు. 18 నుంచి 42 ఏళ్ల వయసు మధ్య ఉండి పీజీ, డేటా ఎనాలసిస్ ప్రెజెంటేషన్ స్కిల్స్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో పాటు అనుభవం కలిగి ఉండాలని తెలిపారు.

15లోపు పీఎఫ్ వివరాలు పంపాలి

ఒంగోలు: జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలోని అన్ని పాఠశాలల డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలోని ఉపాధ్యాయుల పీఎఫ్ వివరాలను జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయానికి ఈనెల 15వ తేదీలోగా పంపాలని ఐఫియా రాష్ట్ర కౌన్సిలర్ పీవీ సుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి సర్క్యులర్ కూడా అన్ని పాఠశాలలకు జారీ అయినందున హెచ్ఎంలు, ఎంఈవోలు సత్వరమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. తమ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల జెడ్పీ పీఎఫ్ చందాదారుల వివరాలతోపాటు ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల్లో ఇతర మండలాలకు, ఇతర ఉన్నత పాఠశాలలకు మారిన వారి వివరాలు కూడా పంపించి పీఎఫ్ ఖాతా పుస్తకాలు తదనుగుణంగా మార్పు జరిగేలా చర్యలు చేపట్టాలని, ఇప్పటి వరకు పీఎఫ్ షెడ్యూలర్స్ కూడా పంపాలని పేర్కొన్నారు.

10న ఒంగోలులో జాబ్‌మేళా


ఒంగోలు అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయం (ఎంప్లాయిమెంట్ ఆఫీస్)లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి టీ భరద్వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో మార్కెటింగ్, సేల్స్ ఆఫీసర్స్, అడ్వయిజర్స్ సెక్టార్‌లలో వివిధ ఖాళీలు భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 23 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల వయసు మధ్య ఉండి, ఇంటర్మీడియెట్, ఏదైనా డిగ్రీ ఆ పై చదువులు పూర్తి చేసిన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మేళా జరుగుతుందని, ఆసక్తి కలిగిన యువత ఇంటర్వ్యూలకు తగిన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేలు నుంచి రూ.21 వేల వరకు వేతనంతో కూడిన ఉద్యోగం ఇస్తారన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ సెలక్షన్స్

ఒంగోలు: అండర్ 14, అండర్ 17 బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 9న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఉదయం 9 గంటలకు ఎంపిక కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9052866392ను సంప్రదించాలన్నారు.

శంకరాపురంలో కొండచిలువ కలకలం

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం గ్రామంలో మంగళవారం కొండచిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు తన వరిగడ్డి వామిలో మేత కోసం వెళ్లగా వరిగడ్డి వామిలో కొండ చిలువ కంట పడింది. దీంతో రైతు భయపడి పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు గుమిగూడారు. కొండ చిలువ వామిలోకి పోకుండా అడ్డుకొని అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. ఎంత సేపటికీ రాకపోవడంతో స్థానికంగా పాములు పట్టే అతనిని పిలిపించి కొండ చిలువను గోతాములో బంధించారు. దానిని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టేందుకు తీసుకెళ్లారు. 12 అడుగుల కొండచిలువ కంట పడడంతో దానిని చూసేందుకు గ్రామస్తులు గుమిగూడారు.



వ్యవసాయం పండగైంది..

అప్పల తిప్పలు తప్పాయి..



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి మద్రిపూడికి చెందిన రైతు పల్లకి వెంకటేశ్వరరెడ్డి. 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఇతనికి పది ఎకరాల సొంత పొలం ఉంది. మరో ఎనినిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మినుము, పొగాకు, బొబ్బర్లు, కంది, శనగ వంటి వాణిజ్య పంటలు పండిస్తున్నాడు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాక ముందు రెండు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి వ్యవసాయం చేయాల్సి వచ్చేది. నాలుగేళ్లుగా రైతుభరోసా ఇస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారని, అప్పుల తిప్పలు తప్పాయని వెంకటేశ్వర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

- నాటి టీడీపీ ప్రభుత్వం రైతులను విస్మరించింది
- నేడు వ్యవసాయరంగం కొత్తపుంతలు
- పంట ఇంటికి చేరే వరకూ రైతుకు అండగా
- రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్
- జిల్లాలో రూ.122.03 కోట్ల రైతు భరోసా విడుదల



రైతులకు చెక్కును అందచేస్తున్న మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్

యర్రగొండపాలెం: నాటి తెలుగుదేశం ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ అంటే నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దానిని పండుగ చేసిందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున, పురపాలక శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రాం ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాల మేరకు వ్యవసాయం చేయటానికి రైతులు ఎటువంటి భయం లేకుండా ముందుకు వెళ్తున్నారని, విత్తనం వేసిన నాటి నుంచి పంట ఇంటికి చేరే వరకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. పంట దళారుల పాలు కాకుండా గిట్టుబాటు ధర కల్పిస్తున్నారని అన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో 564 వాగ్దానాలు చేసి చంద్రబాబు నాయుడు గెలిచాడని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వాగ్దానాలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. పచ్చి అబద్ధాలు చెప్పడంలో ఆయన మొదటి రకం అని, ఆ అబద్ధాలు చెప్పటానికి మళ్లీ మన ముందుకు రావటానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో కూడా టీడీపీ, దాని తోక పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేందుకు తపించే జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వ్యవసాయాన్ని విస్మరించిన పచ్చ ప్రభుత్వం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండుగ అని చెప్పడమే కాకుండా రైతులను విస్మరించడం వలన వారు అప్పుల ఊబిలో కూరుకొనిపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. వ్యవసాయం దండుగ కాదు అని చెప్పి చక్కటి పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి రైతుకు ఒక భరోసా కల్పించారని చెప్పారు. వర్షాభావంతో పశ్చిమ ప్రాంతంలో నెలకొని ఉన్న పరిస్థితులపై సమగ్ర రిపోర్టును ప్రభుత్వానికి పంపాలని ఆయన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరాయని, డిసెంబర్ నాటికి ఆ పనులు పూర్తవుతాయని, ఆ తరువాత కృష్ణమ్మ పశ్చిమ ప్రాంతానికి చేరుతుందని రైతుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. నిర్వాసితులకు ఇంటి పట్టాలు, నష్ట పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో పూర్తిగా వెనకబడిన పుల్లలచెరువు మండలానికి నీటిని అందించేందుకు తీగలేరు 5వ కాలువకు రూ.83 కోట్లు, వరికపూడిసెల ప్రాజెక్టుకు రూ.17 కోట్లు ప్రభుత్వ పరిపాలన ఆమోదం పొందిందన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగిన తనయుడని, రైతులకు మేలు చేయడంలో వైఎస్సార్ వారసత్వాన్ని ఆయన పుణికిపుచ్చుకున్నాడని కొనియాడారు.

జిల్లాలో రూ.122.03 కోట్ల రైతు భరోసా విడుదల

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో భాగంగా 2023–24 సంవత్సరంలో రెండో విడత సొంత భూములు కలిగి ఉన్న రైతులకు రూ.122.03 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని, దీనిద్వారా 2,95,114 మంది రైతు కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ.725.91 కోట్ల ఆర్థిక సహాయాన్ని రైతులకు అందించినట్లు తెలిపారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బిందు, తుంపర సేద్యం చేసే రైతులకు మంజూరైన పరికరాలను అందచేశారు. కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ సేథుమాధవన్, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, జేడీఏ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి గోపిచంద్, ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వి.రమణ, ఆత్మ పీడీ అన్నపూర్ణ, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజరు సుభాషిణి, మండల ప్రత్యేకాధికారి మర్దన్‌అలీ, డీఎల్‌డీవో సాయికుమార్, తహసీల్దార్ రవీంద్రరెడ్డి, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తిరెడ్డి, ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు విజయభాస్కర్, వాగ్యా నాయక్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు షాబీర్ బాష, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు రుణపడి ఉంటాం..



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు కేతు చిన్నపరెడ్డి. పామూరు మండలం చింతలపాలేనికి చెందిన రైతు. ఆయనకు ఉన్న ఐదు ఎకరాల పొలంలో జొన్న, వేరుశనగ సాగుచేస్తున్నాడు. మెట్ట ప్రాంతం. వర్షాలు ఉంటేనే సాగు. గతంలో వర్షాలు లేక, పెట్టుబడికి స్థోమత లేక భూములను బీడుగా వదిలేశాడు. అప్పటి టీడీపీ ప్రభుత్వం సైతం పట్టించుకోక పోవడంతో కుటుంబమంతా పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు. అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడేవారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత కాలం కలిసి వచ్చింది. వర్షాలు పడటంతోపాటు ఖరీఫ్, రబీలకు పెట్టుబడి సాయం ఏటా క్రమం తప్పకుండా అందుతోంది. పంటలు పండుతుండడంతో మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటోందని చిన్నపరెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నాడు. నిరంతరం అండగా నిలిచిన సీఎంకు రుణపడి ఉంటామని అంటున్నాడు.

జిల్లాలో నాలుగేళ్లుగా రైతులకు రూ.725.91 కోట్ల అందజేత

ఒంగోలు సెంట్రల్: వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రైతులకు గత నాలుగేళ్లుగా రూ.725.91 కోట్లు అందించినట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. అందులో దర్శి నియోజకవర్గంలో 44,588 మంది రైతులకు రూ.18.44 కోట్లు, గిద్దలూరులో 44,044 మంది రైతులకు రూ.18.21 కోట్లు, కనిగిరిలో 45,621 మంది రైతులకు రూ.18.86 కోట్లు, కొండపిలో 41,406 మంది రైతులకు రూ.17.12 కోట్లు, మార్కాపురంలో 34,723 మంది రైతులకు రూ.14.36 కోట్లు, ఒంగోలులో 10,628 మంది రైతులకు రూ.4.39 కోట్లు, సంతనూతలపాడులో 31,345 మంది రైతులకు రూ.12.96 కోట్లు, యర్రగొండపాలెంలో 42759 మంది రైతులకు రూ.17.68 కోట్లు అందించారు.

2019 నుంచి 2023 వరకు వచ్చిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా వివరాలు ఇలా ఉన్నాయి...

సంవత్సరం	లబ్ధిపొందిన పొందిన రైతులు	జమ (రూ.కోట్లలో)
2019–23	12,86,256	386.45
2023–24 (మొదటి దఫా)	2,84,113	213.08
2023–24 (కౌలు రైతులు)	5802	4.3515
2023–24 (రెండో దఫా)	2,95,114	122.03

త్వరలోనే హైటెన్షన్ వైర్ల నుంచి నగరానికి విముక్తి

- శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి



భూగర్భ లైన్ల పనుల తీరును పరిశీలిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తదితరులు

ఒంగోలు: త్వరలోనే హైటెన్షన్ వైర్ల నుంచి నగరానికి శాశ్విత విముక్తి కలగనుందని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కర్నూల్‌రోడ్డులో 132 కేవీ హైటెన్షన్ వైర్ల స్థానంలో భూగర్భ విద్యుత్ లైను ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న పనులను బాలినేని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్సీ శేషారెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, ఆపరేషన్ ఈఈ శ్రీనివాసరావులతో కలిసి సమీక్షించారు. పనులు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ కర్నూల్ రోడ్డు బైపాస్ జంక్షన్ వద్ద రూ.24 కోట్ల వ్యయంతో ఈ పనులను ప్రారంభించారన్నారు. గతంలో రూ.40 కోట్ల వ్యయంతో 36వ డివిజన్ నిర్మల్ నగర్, రాజీవ్ నగర్ కాలనీల్లో హైటెన్షన్ వైర్ల సమస్యను పరిష్కరించారన్నారు. వాటి స్థానంలో భూగర్భ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న రెండో దశ పనులు పూర్తయితే కర్నూల్‌రోడ్డు, వెంకటేశ్వర కాలనీల్లో కూడా ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. బాలినేని వెంట నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, గంటా రామానాయుడు, తదితరులు ఉన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: కనిగిరిలో బుధవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, ఎన్జీరంగా వర్శిటీ బోర్డు మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. ఈమేరకు ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్ర బహిరంగ సభకు భారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు, పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బస్సు యాత్ర, బహిరంగ సభ కార్యక్రమంలో ఎంపీ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని చెప్పారు.

భారీ బహిరంగ సభ:

సాయంత్రం 4 గంటలకు చర్చి సెంటర్లో జరిగే బహిరంగ సభకు భారీగా జనం హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ప్రణాళిక చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేసినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో జనాభాలో 60 శాతానికిపైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కుటుంబాలకు లబ్ధి చేకూరినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సీహెచ్ సాల్మన్, డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ, శ్రీ రాం సతీష్, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, మాణిక్యరావు, తమ్మినేని సుజాత, వేల్పుల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీను, దాసరి మురళి, నాయకులు ఖాశింసా, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, డాక్టర్ రసూల్, కంటు గురవయ్య, తొగురు పిచ్చయ్య, చింతం శ్రీనివాసుల యాదవ్, జీ అబ్రహం లింకన్, ఎస్‌కే ఖాజా, సయ్యద్ నాయబ్ రసూల్, అరుణోదర్, సీహెచ్ కిషోర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్ ఇలా..

వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర రూట్ మ్యాప్ వివరాలను నాయకులు వెల్లడించారు.

- బుధవారం ఉదయం 10 గంటలకు నందనమారెళ్ల వద్ద సామాజిక సాధికార బస్సు యాత్ర కనిగిరి నియోజకవర్గంలో ప్రారంభమవుతుంది.
- గం.10.15 కనిగిరి మండలం నందనమారెళ్ల వద్ద స్వాగత జెండా ఆవిష్కరణ, కార్యకర్తలతో సమావేశం అవుతారు. ఆ తర్వాత సూరా పాపిరెడ్డి కాలనీలోని లారీ స్టాండ్ దగ్గర అసోసియేషన్ సభ్యులతో సమావేశం తర్వాత పట్టణంలోని 11వ వార్డు ఎస్టీ కాలనీలో ఎస్టీ వాసులతో (యానాదులతో) సమావేశం నిర్వహిస్తారు. అనంతరం చెక్ పోస్టు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూజల మాలలు వేసి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి బొల్లావులతో స్వాగతం పలికి పాదయాత్ర ప్రారంభమవుతుంది.
- ఆ తర్వాత ఒంగోలు బస్టాండ్‌లోని దర్గా మసీద్ వద్ద ప్రార్థనలు చేస్తారు. బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. కొట్లబజార్ మీదుగా బోడ్డు చావిడి దగ్గర వినాయకునికి పూజలు చేసి, అనంతరం అక్కడే మేధావులు, వ్యాపారులతో సమావేశం అవుతారు.
- ఎమ్మెస్సార్ రోడ్డు, సుగుణమ్మ ఆస్పత్రి సెంటర్, వైఎస్సార్ రోడ్డులో కాలేజీ విద్యార్థులతో మాట్లాడతారు.
- వైఎస్సార్ రోడ్డు మీదుగా, ఓవీ ప్రధాన రోడ్డులో ప్రభుత్వ పాఠశాల, కాలేజీల్లో నాడు–నేడు కార్యక్రమంపై విద్యార్థులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం అక్కడే ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు.. తటస్థులు మేధావులు, ఉద్యోగ వర్గాలతో జరిగే సమావేశంలో మాట్లాడతారు. తరువాత అక్కడే జరిగే విలేకర్ల సమావేశంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడతారు. అక్కడే భోజన కార్యక్రమం ఉంటుంది.
- తరువాత ప్రధాన ఓవీ రోడ్డు పక్కన బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.
- సాయంత్రం 4 గంటలకు స్థానిక పామూరు బస్టాండ్‌లో (చర్చి సెంటర్)లో బహిరంగ సభ నిర్వహిస్తారు.

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక



సాఫ్ట్‌బాల్ బాలికల జిల్లా జట్టు

ఒంగోలు: సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి బాలబాలికల జట్ల ఎంపిక మంగళవారం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. ఎంపికకు ముఖ్య కార్యదర్శిగా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీల్లో సామర్థ్యాలను వినియోగించి రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా రావాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్ ఉద్యోగ అవకాశాల్లో, విద్యార్జన కోసం ప్రవేశాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందంటూ వివరించారు. ఏబీఎం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శివాణి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోను రాణిస్తే అవకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయన్నారు. అండర్ 19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆదినారాయణరావు మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీలో సాఫ్ట్‌బాల్, ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా కోడూరులో బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు మంచి సాధనతో విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఎన్ఐఎస్ కోచ్ టి.తిరునాథ్‌బాబు, జిల్లా కోచ్ టి.గోపీకృష్ణ, టి.ప్రభుదాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు సృజన, స్వాతి, శ్రీను, కిరణ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు:

కె.చరణ్, కేవీ బన్నీ, పి.వాసుదేవరాజ్, పి.కిషోర్, యం.మహీధర్, యం.మధుకర్‌రెడ్డి, ఎస్‌కే ఆసిక్, పి.హర్షనాగసాయి, పి.అమిత్, ఐ.సాత్విక్, ఆర్.బ్రహ్మర్షి, పి.అభిరామ్, యం.మరియదాస్, కె.చైతన్య, జి.వంశీ, పి.రామాంజనేయులు.

సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు:

పి.నందిని, పి.ఇందు, పి.సమన్విత, బి.వాసంతి, ఎల్.మోహిత, ఐ.జ్వాలనవ్య, ఎస్‌కే సహరిన్, ఎస్‌కే నాజ్, అమరిన్, పి.కౌసల్య, నాగహర్షిత, కె.జస్సిక, కె.లిప్సిక, ఐ.నాగవేణి, యం.ధాత్రి, డి.వర్షిణి


బేస్‌బాల్ బాలుర జట్టు:

హెచ్.మణికంఠ, యం.నవదీప్, రసూల్, డి.ధనుష్, యస్.ఇమ్మానుయేల్, వైయు.యుగంధర్‌రెడ్డి, జి.భానుతేజ్, జి.కిషోర్, పీవీ కిరణ్, పి.భాస్కర్, హెచ్.హర్షవర్ధన్, బి.మనోజ్, యం.ఇలవర్ధన్, జి.ప్రభుకుమార్, వి.రోహిత్, యస్.రాధాకృష్ణ, కోచ్ టి.త్రినాథ్‌బాబు, మేనేజర్ బి.సుబ్బారావు.

బేస్‌బాల్ బాలికల జట్టు:

యం.నర్మద, యస్.విజయ, వి.శ్రీవాణి, డి.వినుత నవజయశ్రీ, ఎ.నవ్య, యస్‌కే కరిష్మా, బి.స్వాతి, ప్రణవి, ఎ.మమత, పి.విష్ణుసుబ్బరత్నం, టి.వివిధ, ఎ.శ్రీలక్ష్మి, ఐ.నాగవేణి, ఐ.జ్వాల, అరణ్య, ఎస్‌కే కరీనా, కోచ్ సృజన, మేనేజర్ బి.సుబ్బారావు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



జిల్లా ఖోఖో జట్టుతో కోచ్‌లు, ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టు సిద్ధమైంది. ఈనెల 9 నుంచి 11 వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 14 స్కూల్ గేమ్స్ పోటీల్లో ఈ జట్టు ఆడనుంది. ఈమేరకు పాతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్ కే సాబీర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ క్రీడల్లో రాణించి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఒంగోలుకు చెందిన సమావేశం స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు తాళ్ల రామచంద్రారెడ్డి జిల్లా జట్టుకు రూ.10 వేలు విలువ చేసే దుస్తులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ అట్లా పిచ్చిరెడ్డి, జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి బీ కాశీ విశ్వనాథరెడ్డి, కమటం విజయభాస్కర్‌రెడ్డి, కోచ్‌లు వై శ్రీనివాసుల రెడ్డి, పీ సావిత్రమ్మ పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి


సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఒంగోలు టౌన్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయానికి విధులకు హాజరుకావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో సీనియర్, జూనియర్ సహాయకులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ...ప్రతిరోజు ముఖ ఛాయాచిత్ర హాజరు వేయాలని చెప్పారు. హెచ్‌డీఎస్ నిధులను కమిటీ వేసుకొని అవసరమైన వాటికి ఖర్చు చేయాలని ఏఓ గీతాంజలి సూచించారు. ఆరోగ్య ఆసరా పథకాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. సమీక్షలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, అకౌంటెంట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరు.. ఉసూరు!

- కాకుటూరివారిపాలెం గ్రామంలో నిలిచిన అభివృద్ధి పనులు
- సైంధవుల్లా అడ్డుపడుతున్న టీడీపీ సర్పంచ్ కుమారులు
- పనులకు తీర్మానాలు ఇవ్వకుండా ఆటంకాలు
- పంచాయతీ కార్యదర్శులను పదేపదే బెదిరిస్తున్న వైనం


కాకుటూరివారిపాలె గ్రామ సచివాలయం


మరుగుదొడ్డి ట్యాంకుపై పసుపు రంగు(ఫైల్)

టంగుటూరు: 'ప్రతి రెండు వేల జనాభాకూ ఓ గ్రామ సచివాలయం, అక్కడే ఓ రైతు భరోసా కేంద్రం, దాని పక్కనే ఆరోగ్య ఉప కేంద్రం.. ఇవన్నీ గ్రామంలో ఒకే చోట దర్శనమిస్తే మా పరపతేం కావాలి. రోడ్లేసి, కాలువలు కట్టేస్తే మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు' అచ్చం ఇలాగే ఉంది టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం సర్పంచ్ కుమారుల తీరు. కన్నతల్లిని ముందు పెట్టి రాజకీయం చేస్తున్నారు కానీ తల్లిలాంటి ఊరి అభివృద్ధికి అడ్డుపడుతున్నామన్న సంగతిని వారు ఏమాత్రం గుర్తించలేకపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. టంగుటూరు మండలం జయవరం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు ప్రభుత్వం ఒకే సచివాలయం ఏర్పాటు చేసింది. అది కూడా కాకుటూరివారిపాలెం గ్రామంలో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే గ్రామ టీడీపీ సర్పంచ్ కొమ్మినేని రమణమ్మ కుమారులు అందుకు అడ్డుతగిలారు. పంచాయతీ కార్యదర్శులు తీర్మానాలు అడిగితే ఇవ్వకపోగా వారిని పదేపదే బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. గడిచిన రెండున్నరేళ్లుగా 17 మంది పంచాయతీ కార్యదర్శులు గ్రామం నుంచి బదిలీ అయి వెళ్లిపోయారంటే వారి ఆగడాలు ఎలా ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో అవసరమైన సర్టిఫికెట్లను ప్రజలు సకాలంలో పొందలేకపోతున్నారు.

నిలిచిన అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం కాకుటూరివారిపాలెంలో గ్రామ సచివాలయం నిర్మాణానికి రూ.50 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.30 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ.20 లక్షలు, డ్రైనేజీలు, ఎస్సీ కాలనీలో గృహాలపై 33 కేవీ విద్యుత్ లైను మార్చేందుకు ఎంపీ నిధులు రూ.10 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మరో రూ.10 లక్షలు కేటాయించింది. అయితే ఈ పనుల్లో ఒక్కటి కూడా అడుగు ముందుకు పడలేదు. పంచాయతీ తీర్మానాలు ఇవ్వకపోవడంతో గ్రామంలో రూ.1.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అంతే కాదు సచివాలయ కాంప్లెక్స్ పనులు సాగకుండా కోర్టులో పిటిషన్ కూడా వేశారు.

ఆది నుంచీ అవే ఆగడాలు

గ్రామ సర్పంచిగా రమణమ్మ ఎన్నికైనప్పటి నుంచి ఆమె కుమారులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో పభుత్వ ఆస్పత్రిలో భారీ చెట్టును పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా కొట్టించి టంగుటూరులో అర్తీకి అమ్ముకున్నారు. దీనిపై వివాదం తలెత్తడంతో రాత్రికి రాత్రే ఆసుపత్రిలో పడేసి పంచాయతీ కార్యదర్శిని బెదిరించారు. తాత్కాలిక సచివాలయ ఆవరణలో మరుగుదొడ్డిపై దిమ్మె కట్టి పసుపు రంగు పూసి, పసుపు రంగు ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఆ మరుగుదొడ్డిని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే స్వామితో ప్రారంభించారు.

బాల్యంలో పెళ్లిళ్లు భావితరాలకు ఉరితాళ్లు

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధురి


బాలల హక్కుల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీడీ మాధురి

ఒంగోలు సిటీ: బాల్యంలో చేసే వివాహాలు భావితరాలకు ఉరితాళ్లు వంటివని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.మాధురి అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్సుసెంటర్ ఆధ్వర్యంలో బాలహక్కుల వారోత్సవాల కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీ మాధురి మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజంలోని దురాచారానికి దారిద్ర్యానికి ప్రతి రూపమని, ఆట పాటలతో గడపాల్సిన బాల్యాన్ని సంక్షేమశాఖ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. డీబీఆర్సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలికలలో ముఖ్యంగా రక్తహీనత, అవయవాలు ఎదగకపోవడం, పుట్టే బిడ్డలు మతిస్థిమితం లేకుండా పుట్టడం, కుటుంబం పట్ల సరైన అవగాహన లేకపోవడం అనేక రకాలైన మానసిక సామాజిక సమస్యలను ఎదుర్కొంటారని తెలిపారు. సూపర్‌వైజర్లు కె.దేవసేన, పి.నాగలక్ష్మి, ఎల్.విజయ, ఆర్.సత్యవతి, కార్యాలయ సీనియర్ సహాయకురాలు టి.పద్మశ్రీ, పాల్గొన్నారు.

వంద రోజుల ఉపాధి పనిదినాలు కల్పించాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్


అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు వంద రోజుల పనిదినాలు కచ్చితంగా కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశంభవనం నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. మ్యాజిక్‌సోక్ పిట్స్ పనులు త్వరగా గుర్తించి అనుమతులు పొంది ప్రారంభించారు. అదేవిధంగా రూఫ్ లెవల్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులు కూడా అంచనాలను పంపి అనుమతులు పొంది త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులు త్వగా పూర్తి చేయాలన్నారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసేటప్పుడు ఇంటి లోపలే కుళాయి వేయాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యపటేల్, సీపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీపీఓ నారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, బీసీ సంక్షేమ అధికారి అంజల, మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, ఉద్యానవన అధికారి గోపిచంద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ భజన చేస్తున్న పవన్ కళ్యాణ్

- మాజీ ఎమ్మెల్యే గఫూర్ విమర్శ


ఒంగోలు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న గఫూర్

ఒంగోలు టౌన్: రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీకి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భజన చేస్తున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ విమర్శించారు. ఆయన తీరు చూస్తుంటే సిగ్గేస్తుందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన, చేస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా సాగే పోరాటంలో అన్నీ రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రజారక్షణ భేరిలో భాగంగా సీపీఎం చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం ప్రకాశం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గఫూర్ ప్రసంగిస్తూ.. బీజేపీ పాలకులకు భయపడి చంద్రబాబు నోరుమెదపడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని, విశాఖ ఉక్కును విక్రయానికి పెట్టి తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.

మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే కేపీ, మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డిని సన్మానిస్తున్న షంషేర్, కృష్ణ తదితరులు

- సామాజిక సాధికార యాత్ర విజయవంతంపై ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేసిన నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్లు, గృహసారథులు, సచివాలయ, జేసీఎస్ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. పేదల జీవితాల్లో సంక్షేమ పథకాలు వెలుగులు నింపాయని పేర్కొన్నారు. సామాజిక సాధికార యాత్రకు అన్ని వర్గాల ప్రజలు భారీగా హాజరై సీఎం జగనన్నపై అభిమానాన్ని చాటుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇదే అభిమానాన్ని భవిష్యత్తులో కూడా జగనన్నపై, తమ కుటుంబంపై చూపాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

సామాజిక సాధికార బస్సుయాత్ర, బహిరంగ సభ విజయవంతమైన సందర్భంగా మంగళవారం ఉదయం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్‌మీర్జా షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, తర్లుపాడు, మార్కాపురం ఎంపీపీలు భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, అరుణా చెంచిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్ బుస్సెట్టి నాగేశ్వరరావు, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పీఎల్పీ యాదవ్, శివాలయం ట్రస్టుబోర్డు మెంబర్ శేషగిరిరావు తదితరులు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితోపాటు ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డిని ఘనంగా సన్మానించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

- రూ.2 లక్షల నగదు స్వాధీనం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కళాశాల రోడ్డులో బజాజ్ ఆటో ఫైనాన్స్ షోరూమ్‌లో ఈ ఏడాది జూలై 24న జరిగిన చోరీ కేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ భీమానాయక్ తెలిపారు. మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామానికి చెందిన ముక్కు శ్రీనివాసరెడ్డి ఆటో డ్రైవర్‌గా ఉంటూ తన వాహనానికి ఎప్పుడైనా రిపేర్లు వచ్చినప్పుడు బజాజ్ ఆటో ఫైనాన్స్ షోరూమ్ వద్దకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో జూలై 24 ఉదయం షోరూమ్ షట్టర్‌కు తాళాలు లేకపోవడాన్ని గమనించి షట్టర్ ఓపెన్ చేశాడు. క్యాష్ బాక్సులోని రూ.4 లక్షల నగదు తీసుకుని వెళ్లిపోయాడు. యజమాని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. గొట్టిపడియ గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డిని నిందితుడుగా గుర్తించారు. మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా అదుపులోనికి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. రూ.2 లక్షలను బాకీ కింద ఇతరులకు ఇచ్చానని, మిగిలిన 2 లక్షలు తన వద్ద ఉన్నాయని చెప్పడంతో రికవరీ చేశామని సీఐ వివరించారు.

ధర్మల్ పేపర్ రోల్స్ సరఫరాకు టెండర్ ప్రక్రియ

ఒంగోలు అర్బన్: జిల్లాలోని 1392 రేషన్ షాపులకు సంబంధించి నిత్యావసర సరుకుల పంపిణీలో వినియోగించే ఈ-పాస్ యంత్రాలకు అవసరమైన ధర్మల్ పేపర్ రోల్స్ సరఫరా చేసేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు సివిల్ సప్లయిస్ అధికారి ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు 16,704 రోల్స్ చొప్పున ఆరు నెలలకు 1,00,224 రోల్స్ సరఫరా చేయాలని పొడవు 20 మీటర్లు, మందం 0.06 మి.మీ ఉండాలని తెలిపారు. పేపర్ రోల్ ఒక్కొక్కటి రూ.11 లోబడి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు సీలు కవరులో లెటర్‌హెడ్‌పై కొటేషన్‌ను ఈ నెల 10వ తేదీ లోగా జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు.

తుది మెరిట్ జాబితా విడుదల

ఒంగోలు టౌన్: జిల్లాలోని వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, మల్టీ రీహాబిలిటేషన్ వర్కర్ పోస్టుల కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి తుది మెరిట్ జాబితాను ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీ లోగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. గడవు దాటిన తరువాత వచ్చే అభ్యంతరాలు స్వీకరించమన్నారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో వివిధ పథకాల కింద స్టాఫ్ నర్సుగా ఎంపికై ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిని పనిచేస్తున్న తుది జాబితాలోని దరఖాస్తుదారులు నోటిఫికేషన్‌లో ఎంపికకు అర్హులు కాదన్నారు. అలాంటి అభ్యర్థుల పేర్లను తుది జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ కరాటే జిల్లా జట్టు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు: ఎస్‌జీఎఫ్ కరాటే జిల్లా జట్టుకు 15 మంది విద్యార్థులను ఎంపికచేశారు. స్థానిక శ్రీగురుదత్త పాఠశాలలో మంగళవారం ఈ ఎంపిక జరిగింది. అండర్ 14 బాల బాలికలు, అండర్ 17 బాలుర జట్లకు విద్యార్థులను ఎంపిక చేశారు. బాలికల విభాగం పోటీలను శ్రీప్రతిభ విద్యా సంస్థల సీఈఓ జయప్రకాష్ నారాయణ, బాలుర విభాగం పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజలు ప్రారంభించారు. జిల్లాలోని గిద్దలూరు, మార్కాపురం, కొత్తపట్నం, ఒంగోలు నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు పార్వతీపురం జిల్లా మన్యంలో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఎంపికను ఎస్‌కేఏపీ జిల్లా కార్యదర్శి నల్లూరి మోహన్‌రావు, కరాటే మాస్టర్లు ఎం.శ్రీనివాస రెడ్డి, ఎస్‌డీ శేషావలి, జి.అనీల్ తదితరులు నిర్వహించారు.

అండర్ 14 బాలుర జట్టు

ఎం.తేజవర్ధన్-మార్కాపురం, కేజీఎస్ వెంకట్‌రెడ్డి-శ్రీగురుదత్త స్కూల్, పవన్‌సాయి-శ్రీ గురుదత్త స్కూల్, జేకేఎస్‌సీ భార్గవ్, ఎస్‌కే అబ్దుల్ కలాం- మార్కాపురం, ఎస్‌కేఎండీ షాకీర్‌బాషా-మార్కాపురం

అండర్ 14 బాలికల జట్టు: జె.సాయిత్రిష, ఎస్‌కె ముస్కాన్

అండర్ 17 బాలురు: వై.పవన్ కళ్యాణ్‌రెడ్డి శ్రీగురుదత్త స్కూల్), టి.సాయి జగదీశ్వర్, ఎస్.చరణ్‌కుమార్(మార్కాపురం), ఎస్‌కే అబ్దుల్ కబీర్, ఎం.భాస్కర్, జి.మణికంఠ-శ్రీగురుదత్త స్కూల్, పి.వెంకట శివ, జస్వంత్‌రెడ్డి- మార్కాపురం, సీహెచ్ ప్రకాష్-శ్రీగురుదత్త స్కూల్

ఉద్యోగం పేరుతో మోసం

- మహిళ నుంచి రూ.12.50 లక్షలు వసూలు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

దర్శి: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.12.50 లక్షలు తీసుకుని మోసం చేసిన మహిళపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు దర్శి ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలు.. కృష్ణవేణి అనే మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో తనకు మంచి పరిచయాలు ఉన్నాయని దర్శికి చెందిన లక్ష్మీపద్మావతి, అనీల్ కుమార్‌ను నమ్మించింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని వారి నుంచి రూ.12.50 లక్షల నగదు తీసుకుంది. రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో లక్ష్మీపద్మావతి నిలదీసింది. తరచూ వాయిదాలు వేస్తుండటంతో డబ్బు తిరిగిచ్చేయాలని అడిగినా కృష్ణవేణి స్పందించలేదు. దీంతో బాధితులు తాము మోసపోయామని గ్రహించి దర్శి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఆసక్తి ఉంటే అనంత విశ్వాన్ని మథించవచ్చు' అనడానికి ప్రతీక శకుంతలాదేవి. అరవై దాటిన తర్వాత యూ ట్యూబర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యారు. అంతకంటే ముందు ఆమె తనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకున్నారు. ఆ ప్రపంచంలో సంగీతం, సాహిత్యం, మొక్కల పెంపకం ఉన్నాయి. ఇప్పుడు డిజిటల్ మీడియా వేదికగా సృజనాత్మకతను పంచుతున్నారు. భర్త బాటలో తాను కూడా మరణానంతరం దేహాన్ని డొనేట్ చేశారు.

అర్థవంతమైన జీవితం


శకుంతలాదేవి

శకుంతలాదేవి అత్యంత సాధారణ గృహిణి. నలుగురు పిల్లల్ని పెంచుతూ ఆమె తన అభిరుచులను కొనసాగించారు. సాహిత్యాన్ని ఆస్వాదించకుండా ఉట్టిగా పాటలు వినడంలో ఏదో అసంతృప్తి. అందుకే హిందీ పాటల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి హిందీ– తెలుగు డిక్షనరీలో అర్థాలు వెతుక్కున్నారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాలను ఉబుసుపోని పోస్టులకు పరిమితం చేయలేదామె. సాంకేతిక పాఠాలను స్మార్ట్‌ఫోన్‌తోనే నేర్చుకున్నారు. వీడియో రికార్డ్ చేయడం, ఎడిటింగ్, థంబ్‌నెయిల్ పెట్టడం, యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం వరకు అవసరమైనవి అన్నీ సొంతంగా నేర్చుకున్నారు. తనకు తెలిసిన మంచి విషయాలను డిజిటల్ మీడియా వేదికగా ప్రపంచంతో పంచుకుంటున్నారు. 'నన్ను ప్రపంచానికి తెలియ చేసిన యూట్యూబ్‌కి తొలుత కృతజ్ఞతలు' అంటూ తన వివరాలను 'సాక్షి'తో పంచుకున్నారు స్వర్ణ శకుంతలాదేవి.

ఆధ్యాత్మికం నుంచి అభ్యుదయం వరకు ...

''మాది తెనాలి దగ్గర మూల్పూరు గ్రామం. నాన్న వ్యవసాయంతోపాటు గుడిలో పూజలు చేసేవారు. ఏడుగురు సంతానం. ఐదుగురు అమ్మాయిల్లో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివింది నేనే. మా వారు బీఏఎమ్ఎస్ చదువుతూ ఉండడంతో ఆయన చదువు పూర్తయ్యే వరకు, నాకూ చదువుకునే అవకాశం వచ్చింది. ఫిఫ్త్‌ఫారమ్‌లో ఉండగా పెళ్లయింది. తర్వాత పుట్టింట్లోనే ఉండి ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసి రిజల్ట్స్ వచ్చే నాటికి చీరాలలో అత్తగారింటిలో ఉన్నాను. అప్పట్లో ఆ చదువుకే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగం ఇచ్చేవారు. మా అత్తగారు 'ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముందిప్పుడు' అనడంతో ఇంటికే పరిమితమయ్యాను. టీచర్ అయ్యే అవకాశం అలా చేజారింది. కానీ మా వారి నుంచి ప్రోత్సాహం మాత్రం ఎప్పుడూ ఉండేది. ఆయన ఆయుర్వేద వైద్యులుగా ఒంగోలు దగ్గర అమ్మనబ్రోలులో ప్రాక్టీస్ చేసేవారు. అక్కడే 35 ఏళ్ల పాటు ఉన్నాం. ఇద్దరు పిల్లలు పుట్టిన తరవాత వీణ నేర్చుకున్నాను. ఆ తర్వాత మరో ఇద్దరు పిల్లలు. వాళ్లందరి ఆలనపాలన చూస్తూ నా అభిరుచులను కొనసాగించగలిగాను. ఆధ్యాత్మిక గ్రంథాల నుంచి రంగనాయకమ్మ రాసిన బలిపీఠం, కౌసల్యాదేవి– చక్రవాకం, రవీంద్రనాథుని గీతాంజలి, బాలగంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రి.. ఇలా అదీ ఇదీ అనే వర్గీకరణ లేకుండా చదివేదాన్ని. యద్దనపూడి, మాదిరెడ్డి, యండమూరి, శ్రీశ్రీ రచనలను, అబ్దుల్‌కలామ్ వంటి ప్రముఖుల జీవిత చరిత్రలను ఇష్టంగా చదివాను. కొన్ని రచనలు రేడియోలో నాటికలుగా వచ్చేవి. వాటి కోసం రేడియోకి అంకితమయ్యేదాన్ని. ఇలా సాగుతున్న జీవితంలో పిల్లలు నలుగురూ సెటిల్ అయిన తర్వాత మా వారు ప్రాక్టీస్ చాలించారు. 2005లో చీరాలకు వచ్చాం.

పెద్దబ్బాయి కొత్తదారిలో నడిపించాడు

మా పెద్దబ్బాయి నన్ను కొత్తగా ఆవిష్కరించాడు. తను మెకానికల్ ఇంజనీర్. తాను ఆసక్తి కొద్దీ జెమాలజీ కోర్సు చేశాడు. రత్నాల గురించిన కబుర్లు నాకు ఎక్కువ ఆసక్తినివ్వడంతో రత్నాలకు – రాళ్లకు మధ్య తేడాను గుర్తించడం నేర్పించాడు. ముత్యాలు, పగడాలతోపాటు రకరకాల బీడ్స్, జెమ్స్, సెమీ ప్రెషియస్ స్టోన్స్‌తో ఆర్నమెంట్ మేకింగ్ నేర్పించాడు. జీవితాన్ని మనం ఎంత ఉత్సాహవంతంగా, రాగరంజితంగా మార్చుకున్నప్పటికీ ఏదో ఒక వెలితిని సృష్టించి ప్రశ్నార్థకంగా మన ముందు పెడుతుంది. నా అభిరుచులు మాత్రమే నాతో మిగిలాయి, వాటిని ప్రోత్సహించిన మావారు మాకు దూరమయ్యారు. ఆయన కోరిక మేరకు దేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం ఒంగోలులో మెడికల్ కాలేజీకి ప్రదానం చేశాం. ఆయన బాటలో నేను కూడా మరణానంతరం నా దేహాన్ని డొనేట్ చేస్తూ సంతకం చేశాను. మనం జీవిస్తూ మరొకరికి ఉపయోగం కలిగించడమే జీవితానికి అసలైన అర్థం అని నమ్ముతాను. ఆయన జ్ఞాపకాలతో రోజులు సాగుతున్న సమయంలో కోవిడ్ ప్రపంచాన్ని కుదిపేసింది.

యూ ట్యూబ్ ఆత్మీయులనిచ్చింది

కోవిడ్ సమయంలో అగాధంలాంటి విరామం. ఆ విరామం ఎంత కాలమో కూడా తెలియదు. యూ ట్యూబ్ చానెల్స్ చూస్తూ, మా వారు సుబ్రహ్మణ్య కుమార్ రాసిన వైద్య గ్రంథాన్ని చదువుతూ గడిపాను. అప్పుడు నాక్కూడా నాకు తెలిసిన సంగతులు చెప్పాలనిపించింది. గూగుల్ లేని రోజుల్లోనే నిత్యాన్వేషిగా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. చేతిలోకి స్మార్ట్‌ఫోన్ వచ్చిన తర్వాత ఇక కష్టమేముంది? యూ ట్యూబ్‌కి సంబంధించిన పరిజ్ఞానమంతా 'హౌ టూ అప్‌లోడ్, హౌ టూ డూ ఎడిటింగ్, హౌ టూ డూ థంబ్‌నెయిల్' అంటూ 'హౌ టూ' అని అడుగుతూ నేర్చుకున్నాను. మొదట వంటలు, ఇంటి అలంకరణ, మా వారు రాసిన వైద్యగ్రంథంలోని విషయాలను చెప్పాలనుకుని 2021లో యూ ట్యూబ్ చానెల్ మొదలుపెట్టాను. కొంతకాలం తర్వాత యూ ట్యూబ్ గుర్తించాలంటే ఏదో ఒక టాపిక్ మీదనే దృష్టి పెట్టమని సూచించారు పిల్లలు. వంటలు చాలామంది చేస్తున్నారు. ముత్యాలు, పగడాల గురించి చాలామందికి తెలియని సంగతులు చాలా ఉన్నాయి. వాటి గురించి చెప్పమన్నారు మా పిల్లలు. ఆ తర్వాత నాకు సబ్‌స్క్రైబర్స్ రెండున్నర లక్షలకు పెరగడంతోపాటు ఫాన్ ఫాలోయింగ్ కూడా పెరిగింది. డాక్టర్‌లు, సైంటిస్ట్‌లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు... సందేహాలడుగుతుంటే నాకు తెలిసినదెంత? ఇంత పెద్ద చదువులు చదువుకున్న వాళ్ల సందేహాలు నేను తీర్చడమేమిటని ఆశ్చర్యంగా ఉంటుంది కూడా. అసలు ముత్యాన్ని, నకిలీ ముత్యాన్ని ఎలా గుర్తించాలి, తైవాన్ పగడం ఎలా ఉంటుంది, ఇటాలియన్ పగడాలెలా ఉంటాయి, వేటిని క్యారట్‌లలో తూస్తారు, వేటిని గ్రాముల్లో తూస్తారు... వంటి విషయాలనెన్నో చెప్పాను. యూ ట్యూబర్‌గా నేను డబ్బుకంటే వెలకట్టలేని ఆత్మీయతను, అభిమానాన్ని సంపాదించుకున్నాను. ఆంటీ, అమ్మా అనే పిలుపులతోపాటు ఈ తరం యువతులు వాళ్ల సందేహాల కోసం ఫోన్ చేసి 'అమ్మమ్మా' అని పిలుస్తుంటే చాలా సంతోషంగా ఉంటోంది. మనిషి, మెదడు పని లేకుండా ఖాళీగా ఉండకూడదు. అలాగే ఎంటర్‌టైన్‌మెంట్ మన మైండ్‌ని చెడగొట్టకూడదని నమ్ముతాను. అందుకే టీవీ సీరియల్స్ నన్ను ఆకర్షించలేదు. నాకు నేనుగా సమయాన్ని ఇలా ఆనందంగా, ఉపయుక్తంగా మలుచుకున్నాను'' అన్నారు శకుంతలాదేవి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఆర్ట్ సైంటిస్ట్

కళ



ఆర్ట్, ఫ్యాషన్‌ను కలిపి తనదైన కళను ఆవిష్కరించింది ఢిల్లీకి చెందిన పాయల్ జైన్.

ఫ్యాషన్ రంగంలో పేరుగాంచిన పాయల్ జైన్ మంచి ఆర్టిస్ట్ కూడా.

ఆమె తాజా ఎగ్జిబిషన్....సోల్ ఆఫ్ ఏ ఉమెన్.

ఎగ్జిబిషన్‌లో కనిపించే 30 పీస్‌లలో ప్రతి దాంట్లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. చరిత్ర నుంచి కవిత్వం వరకు ఏదో ఒక అంశ ధ్వనిస్తుంది.

'ఆర్ట్‌లో సైన్స్ ఉంటుంది. సైన్స్‌లో ఆర్ట్ ఉంటుంది' అనే పాయల్ జైన్‌ను ఆర్ట్ సైంటిస్ట్‌గా పిలుచుకోవచ్చు.

ఫ్యాషన్ ఇండస్ట్రీలో తన మూడు దశాబ్దాల ప్రయాణానికి 'సోల్ ఆఫ్ ఏ ఉమెన్' ప్రతిబింబం అంటుంది పాయల్. ఈ ఎగ్జిబిషన్‌లోని ముప్పై పీస్‌లలో ప్రతి పీస్‌కు ఏదో ఒక ప్రత్యేకత ఉంది. మెక్సికన్ పెయింటర్ ఫ్రీదా ఖాలోను స్ఫూర్తిగా తీసుకొని 'ఫర్‌బిడెన్ లవ్' కలెక్షన్ రూపొందించింది. పాయల్ అభిమానించే ఖాలో పెయింటర్, మ్యాజికల్ సర్రియలిస్ట్, ఫెమినిస్ట్, రెవల్యూషనరీ.

పాయల్ ఆర్కిటెక్చర్ నుంచి ఫ్యాషన్ రంగంలోకి రావడానికి కారణం చిత్రకళ పట్ల తనకు ఉన్న అనురక్తి. స్కెచ్చింగ్ తనకు ఇష్టమైన పని. ఆమె తల్లి కూడా ఆర్టిస్టే. సితార్ అద్భుతంగా వాయించేది. తన కలల గురించి తల్లిదండ్రులకు చెప్పినప్పుడు ' ఏదో ఒక డిగ్రీ నీ చేతిలో కనిపించాలి. ఆ తరువాతే ఏదైనా' అన్నారు. అలా బీకామ్ పూర్తి చేసింది.

పాయల్ స్కెచ్చింగ్ నైపుణ్యాన్ని చూసి 'నువ్వు ఫ్యాషన్ ఇండస్ట్రీలో ప్రయత్నించవచ్చు' అని సలహా ఇచ్చారు సన్నిహితులు. మొదట ఫ్యాషన్ ఇండస్ట్రీకి సంబంధించి పుస్తకాలు, మ్యాగజైన్స్ విరివిగా చదివేది. అలా ఫ్యాషన్ కూడా తన ప్యాషన్‌గా మారింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది.

'ఫ్యాషన్‌కు ఆర్ట్, సైన్స్ అనే రెండు కోణాలు ఉంటాయి. ఆర్ట్ అనేది సృజనాత్మకతకు సంబంధించిన కోణం, సైన్స్ అనేది సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన కోణం. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ నా దృష్టిని విశాలం చేసింది. ప్యాటర్న్‌మేకింగ్, డ్రాపింగ్, గ్రేడింగ్, ఇలస్ట్రేషన్, ఫ్యాషన్ మార్కెటింగ్...ఇలా ఎన్నో విషయాలను తెలుసుకున్నాను' అంటున్న పాయల్ ఎన్నో కార్పొరేట్ హోటల్స్‌కు ఆకట్టుకునేలా 'హోటల్ యూనిఫామ్'ను డిజైన్ చేసి ఇచ్చింది.


సోల్ ఆఫ్ ఏ ఉమెన్

'డిజైనర్స్ అంటే గొప్ప ఏమీ కాదు. గ్లోరిఫైడ్ టైలర్స్ మాత్రమే' అని చాలా మంది అనుకొని అపోహపడే కాలంలో డిజైనర్‌గా కెరీర్ ప్రారంభించింది పాయల్. ఆమె వెస్ట్రన్ క్లాతింగ్ మొదలుపెట్టినప్పుడు దానికి మార్కెట్ లేదు. అయితే ఆ తరువాత మాత్రం పరిస్థితిలో మార్పు వచ్చింది.

పాయల్ సక్సెస్ మంత్రా ఏమిటి?

ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

'చేయాలి కాబట్టి చేస్తున్నాం అనే ధోరణిలో కాకుండా మనం చేస్తున్న పనిని మనసారా ప్రేమించాలి. నిద్ర, శ్వాస, కలలో మన లక్ష్యం కనిపించాలి. ఫెయిల్యూర్‌కు చోటివ్వకుండా సాంకేతిక జ్ఞానంపై గట్టి పట్టు సంపాదించాలి. ఎప్పటికప్పుడు మన ఆలోచనల్లో కొత్తదనం వచ్చేలా చూసుకోవాలి. ప్రశంసలు ఆస్వాదించడానికి మాత్రమే పరిమితమైపోకుండా అన్ని కోణాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. మార్పులు చేర్పులు చేసుకోవాలి. సానుకూల శక్తి, సంకల్పబలం ఎప్పటికీ మనకు తోడుగా ఉండాలి'

కెరీర్ తొలి రోజుల్లో తాను ఎదుర్కొన్న ఆటుపోట్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది పాయల్. చేదుజ్ఞాపకాలుగా కాదు...ఆ సమయంలోనూ తాను ఎంత ధైర్యంగా ఉందో మళ్లీ మళ్లీ గుర్తు తెచ్చుకోవడానికి.

'విజయం ధైర్యవంతులను వెదుక్కుంటూ వస్తుంది' అని చెప్పడానికి ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఆమె తెచ్చుకున్న పేరే నిదర్శనం.

సినిమా

ప్రతి కణం కణం...


సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్

టైగర్, జోయాల ప్రేమ బలమైనది. ప్రేయసి మీద తనకున్న ప్రేమను వ్యక్తపరచడానికి 'మెరిసే నీ కనులే.. ముసిరే నీ కనులే..', 'ప్రతి కణం.. కణంలో...' అంటూ పాట అందుకున్నారు టైగర్. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'టైగర్ జిందా హై'కి సీక్వెల్‌గా రూపొందిన 'టైగర్ 3'లోని పాట ఇది. టైగర్‌గా సల్మాన్ ఖాన్, జోయాగా కత్రినా కైఫ్ నటించగా మనీష్ శర్మ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలోని రెండో పాట 'ప్రతి కణం కణం..'ను మంగళవారం రిలీజ్ చేశారు. ''ఈ పాట టైగర్, జోయాల అన్యోన్యతను ఆవిష్కరించే విధంగా ఉంటుంది. ఆ కెమిస్ట్రీని సిల్వర్ స్క్రీన్‌పై చూసి, అనుభూతి చెందాల్సిందే. అందుకే వీడియోను ముందుగా రిలీజ్ చేయలేదు'' అన్నారు ఆదిత్యా చోప్రా. ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది.

నా తలరాతే రంగుల రంగోలి...


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు అభిమానుల్లో దీపావళి పండగ సంబరం ఆరంభమైంది. జోష్‌గా పండగ చేసుకునేలా మహేశ్‌బాబు హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం' నుంచి 'దమ్ మసాలా...' పూర్తి పాటను విడుదల చేశారు. ఈ చిత్రదర్శకుడు త్రివిక్రమ్ పుట్టినరోజు (నవంబర్ 7) సందర్భంగా మంగళవారం ఈ పాటను రిలీజ్ చేశారు. చిత్ర సంగీతదర్శకుడు తమన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా సంజిత్ హెగ్డే, జ్యోతి నూరన్ ఆలపించారు. ''నా తలరాతే రంగుల రంగోలి.. దిగులైనా చేస్తా దీవాలి.. నా నవ్వుల కోటని నేనే ఎందుకు పడగొట్టాలి', 'నేనో నిశ్శబ్దం.. అనునిత్యం నాతో నాకే యుద్ధం' అంటూ సాగే ఈ పాట హీరో పాత్ర తీరుని తెలియజేసే విధంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. మహేశ్ సరసన శ్రీలీల కథానాయికగా, మీనాక్షీ చౌదరి, జగపతిబాబు, జయరామ్, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ తదితరులతో ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

యాత్రలో జర్మనీ నటి సుజానే



'యాత్ర' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'యాత్ర 2'. ఇందులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమాలో సోనియా గాంధీ పాత్రని జర్మనీ నటి సుజానే బెర్నెర్ట్ పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మహి వి. రాఘవ్ మాట్లాడుతూ–''యాత్ర'కి కొనసాగింపుగా 'యాత్ర 2' రూపొందుతోంది. వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనలను ఈ చిత్రంలో చూపిస్తున్నాం. 'యాత్ర 2'ని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

దీపావళి మనసుని హత్తుకుంటుంది – 'స్రవంతి' రవికిశోర్



''ఇప్పుడు ప్రేక్షకులు పెద్ద చిత్రాలతో పాటు చిన్న సినిమాలు కూడా చూస్తున్నారు. మా 'దీపావళి' చిన్నదైనా అందమైన సినిమా. ఇందులోని భావోద్వేగాలు ప్రేక్షకుల మనసులను హత్తుకుంటాయి'' అని నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ అన్నారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రల్లో ఆర్ఏ వెంకట్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'కీడా' (తెలుగులో 'దీపావళి'). కృష్ణ చైతన్య సమర్పణలో 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''నిర్మాతగా 38 ఏళ్ల జర్నీలో దాదాపుగా నేను చేసిన సినిమాలన్నీ సంతృప్తినిచ్చాయి. నేను డబ్బుల గురించి ఆలోచించను. ప్రేక్షకులకు సినిమా కనెక్ట్ అవుతుందా? లేదా అని మాత్రమే ఆలోచిస్తా. కథ పూర్తయ్యాకే సినిమాని సెట్స్ మీదకు తీసుకెళతాను. ఓ సినిమా పూర్తయ్యాకే మరొకటి చేస్తాను. నేను తక్కువ సినిమాలు చేయడానికి కారణం అదే. 'దీపావళి' కథని ప్రాణం పెట్టి రాశాడు వెంకట్. చెప్పిన కథను చెప్పినట్లు స్క్రీన్ మీదకు తీసుకొచ్చాడు. మా సినిమా ఇండియన్ పనోరమాకి ఎంపికవడం గొప్ప అనుభూతి. చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించడం సంతోషంగా ఉంది. ఇక రామ్ హీరోగా ఓ సినిమా చేసేందుకు స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అలాగే రామ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాలని ఉంది. ఇందుకు సరైన కథ కుదరాలి'' అన్నారు.

జపాన్‌లో నటిగా కనిపిస్తాను


అనూ ఇమ్మాన్యుయేల్

''జపాన్' వైవిధ్యమైన చిత్రం. చాలా క్రేజీగా ఉంటుంది. ఈ దీపావళికి పర్ఫెక్ట్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. తప్పకుండా అందరూ థియేటర్స్‌లోనే చూడాలి'' అని హీరోయిన్ అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 10న రిలీజవుతోంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా అనూ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ– ''రాజు మురుగన్‌గారి సినిమాలు వైవిధ్యంగా ఉంటాయి. అలాగే 'జపాన్' కూడా. ఈ చిత్రంలో ఓ నటిగా కనిపిస్తా. నా పాత్ర జపాన్ (కార్తీ) లైఫ్‌లో కీలకంగా ఉంటుంది. ఇక ఫలానా పాత్ర చేయాలనే కలలు నాకు లేవు. ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు.

వారి మాటలే నాలో స్ఫూర్తి నింపాయి – సురేష్ కొండేటి



''సంతోషం' సినీ వారపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా 'ఫిల్మ్ ఫేర్' అవార్డుల్లాగా సంతోషం అవార్డులు ఇస్తే బాగుంటుందని నాగార్జునగారు అన్నారు. దీంతో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్'ని ప్రతి ఏటా ఇస్తున్నాను. అలాగే నన్ను నిర్మాతగా చూడాలని చిరంజీవిగారు అనడంతో నిర్మాత అయ్యాను. వారిద్దరి మాటలు నాలో స్ఫూర్తి నింపడంతో ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను'' అని నిర్మాత, 'సంతోషం' సినీ వారపత్రిక అధినేత సురేష్ కొండేటి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ నెల 18న హైదరాబాద్‌లో 'సంతోషం ఓటీటీ అవార్డ్స్'ని ఇస్తున్నాం. డిసెంబరు 2న గోవాలో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం. ఈ వేడుకకు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరవుతారు. సంతోషం అవార్డ్స్‌ని 25ఏళ్ల పాటు కొనసాగించాలనుకున్నాను. ఇప్పటికి 22 ఏళ్లయింది. ఇంకో మూడేళ్లు కచ్చితంగా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహిస్తాను. మరోవైపు సినిమాలు నిర్మిస్తున్నాను. నటుడిగా ఐదారు సినిమాల్లో కీ రోల్స్ చేస్తున్నాను'' అన్నారు.

లవ్.. థ్రిల్...


హృతిక్ శౌర్య

హృతిక్ శౌర్య హీరోగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'అశ్వత్థామ'. 'హతః అశ్వర' అనేది ఉపశీర్షిక. చంద్రశేఖర్ ఆజాద్ పాటిబండ్ల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఫ్లిక్‌నైన్ స్టూడియో సంస్థ నిర్మిస్తోంది. హృతిక్ శౌర్య బర్త్‌డే సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ – ''ఓ టు'తో హృతిక్ హీరోగా కెరీర్ ప్రారంభించారు. అందులో సాఫ్ట్ కుర్రాడిగా కనిపించిన ఆయన 'అశ్వత్థామ'లో కమర్షియల్ హీరోగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం హృతిక్ చేసిన యాక్షన్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్, క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇది'' అని అన్నారు.

పాటల్లో నవరసాలుంటాయి – సుభాష్ ఆనంద్



''అలా నిన్ను చేరి' సినిమాలోని ప్రతీ పాట అద్భుతంగా ఉంటుంది. ఒక్కో పాటను ఒక్కో శైలిలో కంపోజ్ చేసే చాన్స్ నాకు దొరికింది. నవరసాలను చూపించేలా ఇందులోని పాటలుంటాయి'' అని సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ– ''ఫీల్ గుడ్ లవ్ స్టోరీ చిత్రమిది. ప్రేమ కథా చిత్రాలకు సంగీతమే ప్రాణం. నేను చాలా సినిమాలకు సంగీతం అందించాను. అయితే 'అలా నిన్ను చేరి' నా కెరీర్‌కి గుడ్ టర్న్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

ఆరుగురి కథ


'టెనెంట్'లో ఓ దృశ్యం

'సత్యం' రాజేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. ఇందులో మేఘా చౌదరి హీరోయిన్. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వై. యుగంధర్ మాట్లాడుతూ– ''జీవితం ఆడే వైకుంఠ పాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు ముఖ్య పాత్రల మధ్య జరిగే కథే ఈ చిత్రం. ప్రస్తుత అర్బన్ లైఫ్ జీవన శైలిలో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ తయారు చేసిన ఈ కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: జెమిన్ జోం అయ్యనీత్, సహనిర్మాత: ఎస్. రవీందర్ రెడ్డి.